IndiaFirst
LIFE INSURANCE

**Publication: Eenadu** **Date: Tuesday, 17th March, 2015**

**Edition: Hyderabad**

# ఆ మాటలు తప్పని నిరూపించా!



'ఓ మహిళగా ఈ రంగంలో రాణించ లేవు. ఇక్కడ నెట్‌వర్క్ ఏర్పాటుచేసుకో వడం అంత సులభమేం కాదు. మగవా ళ్లతో ఆఫీసు పనివేళలు దాటిన తర్వాతా చనువుగా ఉండాలి. కొన్నిసార్లు మందు కూడా తాగాల్సి ఉంటుంది...' - ఇన్సూ రెన్స్ మార్కెటింగ్ రంగం లోకి ఆమె అడుగుపెట్టిన కొత్తల్లో సహచరులు ఇలా భయపెట్టారట! అవన్నీ ఏమీ అక్కర్లేకుండానే ఆత్మాభిమానంతో.. ఆత్మవిశ్వాసంతో ఈ రంగంలో ఉన్నతస్థాయికి చేరుకోవ చ్చని నిరూపించారామె. ఇండియాఫస్ట్ లైఫ్ఇన్సూరెన్స్ సంస్థకు తొలి మహిళా ఎండీ, సీఈవో స్థాయికి చేరుకున్నారు. ఆమే ఆర్.ఎం. విశాఖ. అదెలా సాధ్యమైందో చెబుతున్నారిలా..

'నీపై నువ్వు నమ్మకం పెట్టుకో. అప్పుడు మిగిలినవారూ సహకరిస్తారు. మనపై మనకు సందేహం మొదలైతే చుట్టూ ఉన్నవారు కిందకు లాగేస్తారు...' - న్యూ ఇండియా అస్యూరెన్స్ సంస్థలో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగానికి వెళ్లిన తొలిరోజే నేను నేర్చుకున్న పాఠం ఇది. అందుకనే ప్రతిసారీ నేను మనసులో అనుకున్నదాన్ని తు.చ. తప్పకుండా చేయడం నేర్చుకున్నాను. కొందరు దాన్ని మొండితనం అనుకుంటారు కానీ అదే నా బలం అని నమ్ముతాను. మాది హైదరాబాదే. సీఏ చదివాను. మొదట న్యూ ఇండియా అస్యూరెన్స్‌లో పదమూడేళ్లు చేశాక.. బిర్లా సన్‌లైఫ్ ఇన్సూరెన్స్‌లో చీఫ్ మేనేజర్‌గా చేరా. అక్కడ బ్రాంచి మేనేజర్‌గా నేను బాధ్యతలు తీసుకున్నాక మొదటిరోజు నేను చేసిన ఓ పని నాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది.

## మన ముద్ర అదే..!

ఆ రోజు ఓ వృద్ధ దంపతులు నా దగ్గరకు వచ్చారు. తమ ఇరవైమూడేళ్ల అబ్బాయి పోయాడనీ, దానికి సంబంధించిన బీమా మొత్తం ఇవ్వాలని చెప్పారు! ఆ దైన్యం చూసి కదిలిపోయాను. మరో కార్యాలయంలో అయితే వాళ్లని కొన్ని రోజులైనా తిప్పించుకునేవాళ్లు. నేనూ, నా బృందం ఒకటిరెండు రోజుల్లో అన్నీ పూర్తి చేసి పత్రాలు చేతికిచ్చాం. అప్పుడు వారి కళ్లల్లో కదలాడిన కన్నీటిలోతేమిటో ఓ మహిళగా నేను మాత్రమే అర్థం చేసుకోగలను! ఇలాంటి అంశాలని స్త్రీలు మాత్రమే మనసుతో ఆలోచించగలరన్నది నా ప్రగాఢ నమ్మకం. మా రంగంలో అది చాలా అవసరం కూడా. ఆ సంస్థలో కొంతకాలం పనిచేశాక ఎనిమిదేళ్ల కిందట ఐడీబీఐ ఫెడరల్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో చేరాను. అక్కడ బ్యాంక్ అస్యూరెన్స్ విభాగాన్ని ఏర్పాటు చేయడంలో నాది కీలక పాత్ర. ఆ తర్వాతే ఇప్పుడున్న సంస్థకి వచ్చాను.

## గ్లాస్ సీలింగ్ లేకేం కాదు..

ఈ రంగంలో కెరీర్ మొదలుపెట్టిన కొత్తల్లో ఇక్కడ ఆడవాళ్లు నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకోవడం కష్టమని చెప్పారు. కార్యాలయం వేళల తర్వాత అందరితో కలిసి మందు తాగితేనే అది సాధ్యమన్నది వాళ్ల నమ్మకం! అవన్నీ అబద్ధాలని.. అంతగా ఆత్మాభిమానం కోల్పోవడం అవసరం లేదని నిరూపించాన్నేను. కృతకమైన సంభాషణలు కాకుండా నిజాయతీగా ఉంటే చాలని నమ్మాను. 'మా రంగంలో అసలు గ్లాస్ సీలింగే లేదు..' అని చెప్పలేను కానీ.. నాతో కలిసి చేరిన మగవాళ్లు నేను చూస్తుండగానే సంస్థలో ఉన్నత స్థాయికి చేరుకున్నారు! కానీ వాటితో నేను కుంగిపోలేదు. వాళ్లకంటే పదిరెట్లు ప్రణాళికాబద్ధంగా శ్రమించాను. అదే నన్ను ఈ స్థాయికి చేర్చింది. అంతమాత్రాన కుటుంబాన్నీ నిర్లక్ష్యం చేయలేదు. ఇంతటికీ కారణం అమ్మావాళ్లు చిన్నప్పుడే నాకు అందించిన ప్రోత్సాహమే. 'నేను అమ్మాయిని, ఏదీ చేయలేనేమో..!' అనే ఆలోచనని ఎప్పుడూ కల్పించలేదు. ఒక విషయంపై నిజాయతీగా కృషి చేస్తే అందులో విజయం సాధించకున్నా బాధపడాల్సిన అవసరం లేదనే తత్వం ఇంటి నుంచే నేర్చుకున్నా. ఆ కృషి మానకుంటే ఏ విజయమూ మనల్ని దాటిపోయే అవకాశం లేదని నా స్వానుభవం నేర్పించింది. మా బీమా సంస్థ ప్రారంభించి ఐదేళ్లే అవుతోంది. భారత ప్రభుత్వం ప్రైవేటు బీమా సంస్థల మధ్య మరింత పోటీని పెంచుతున్న నేపథ్యంలో మా సంస్థని వచ్చే ఐదేళ్లలో నెంబర్‌వన్‌గా నిలపాలన్నదే నా ఆశయం!